క్లుప్తంగా

చైన్ స్నాచింగ్‌కు దుండగుల యత్నం

- ప్రతిఘటించిన మహిళ
- నిందితుడికి దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత

నెల్లూరు(క్రైమ్): కుమారుడ్ని ఆటో ఎక్కించి ఇంటికెళ్తున్న మహిళ మెడలోని గొలుసును తెంపుకెళ్లేందుకు ఇద్దరు దుండగులు యత్నించారు. దీంతో మహిళ ప్రతిఘటించారు. స్థానికుల సాయంతో ఓ నిందితుడ్ని పట్టుకోగా, మరో నిందితుడు పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌లోని రామ్‌జీనగర్ నాలుగో వీధిలో నివాసం ఉంటున్న ఉమశ్రీ ఓ ఇంజినీరింగ్ కళాశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడ్ని బెంగళూరు పంపేందుకు గానూ సాయిబాబా మందిరం వద్ద ఆటోలో గురువారం రాత్రి ఎక్కించారు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి నడుచుకొని బయల్దేరారు. ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ఆమెను బైక్‌పై వెంబడించారు. ఇంటి సమీపంలోకి వచ్చేసరికి దుండగుల్లో ఒకరు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లేందుకు యత్నించాడు. ప్రతిఘటించడంతో చైన్ తెగి సగం ఆమె చేతిలోకి, మరో సగం నిందితుడి చేతిలో ఉండిపోయింది. వారిని పట్టుకునే క్రమంలో బాధితురాలు పెద్దగా కేకలేశారు. దీంతో స్థానికంగా ఉన్న యువకులు బైక్‌పై వెళ్తున్న దుండగులపై పుస్తకాలు విసిరారు. బైక్ అదుపుతప్పి నిందితులు కింద పడ్డారు. ఒకరు పరారవ్వగా, మరొకరు స్థానికులకు చిక్కాడు. దీంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేసి బాలాజీనగర్ పోలీసులకు అప్పగించారు. తమదైన శైలిలో పోలీసులు విచారించారు. మరో నిందితుడి వివరాలను సేకరించి అతడ్ని సైతం అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరూ సరస్వతీనగర్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వారిపై ఎలాంటి కేసుల్లేవని తెలిసింది. ఇదే తరహాలో నిందితులు ఏమైనా నేరాలకు పాల్పడ్డారాననే వివరాలను రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

పేరుకుపోతున్న చెత్త



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై చెత్తను తొలగించే నాథుడే కరువవుతున్నారు. 53వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు కార్పొరేషన్‌కు సంబంధించిన చెత్త సేకరణ వాహనాలు రోజూ రావడంలేదు. దీంతో విధిలేక చెత్తను స్థానికులు ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. అదే విధంగా కాలువల్లో పూడికతీత పనులూ సక్రమంగా జరగడంలేదు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్ట్‌లో నారాయణ వైద్య కళాశాలకు చెందిన నాగశ్రీఅంజన, నితీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, యూత్ అఫైర్స్ మంత్రి అనురాగ్ ఠాకూర్, కర్ణాటక సీఎం బసవ్‌రాజ్ బొమ్మై, తదితరులు హాజరయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులను నారాయణ వైద్య కళాశాలలో డీన్ సూర్యప్రకాష్‌రావు, వైస్ ప్రిన్సిపల్స్ జ్యోతి, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్‌నాయుడు అభినందించారు.

మధుమోహన్‌కు ప్రశంస

నెల్లూరు(అర్బన్): వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ మధుమోహన్‌ను అభినందిస్తూ రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు లేఖ పంపారు. దీనికి సంబంధించిన వివరాలను నగరంలోని తన కార్యాలయంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్ తెలియజేశారు. వింజమూరులోని ప్రభుత్వాస్పత్రిలో ఇప్పటి వరకు కాన్పులు చేసేవారు కాదన్నారు. అయితే మధుమోహన్ తన భార్య సుజాతను అక్కడి ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 11న చేర్పించి కాన్పును నిర్వహించారని పేర్కొన్నారు. ఆమెకు ఆడ శిశువు పుట్టిందని.. ప్రస్తుతం వీరు క్షేమంగా ఉన్నారన్నారు. విషయాన్ని తెలుసుకున్న కృష్ణబాబు అభినందిస్తూ లేఖను పంపారని వివరించారు. కలెక్టర్ చక్రధర్‌బాబు సైతం ప్రత్యేకంగా అభినందనలను తెలిపారన్నారు.

చెడుగుడు విజేత నెల్లూరు

నాగులుప్పలపాడు: సంక్రాంతిని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన చెడుగుడు పోటీల విజేతగా నెల్లూరు జిల్లా పురుషుల జట్టు నిలిచింది. ప్రకాశం జట్టుపై విజయం సాధించి రూ.50 వేల బహుమతిని గెలుపొందింది. పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవి, నేత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

26 నుంచి క్లాత్ బ్యానర్లనే వినియోగించాలి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీలు పూర్తిగా నిషేధమని, హోర్డింగుల్లో సైతం క్లాత్ బ్యానర్లనే వినియోగించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్లో గల ఏసీనగర్‌లో వివేకానంద స్కూల్ వీధి, మున్సిపల్ క్వార్టర్స్, మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. అందుతున్న తీరును ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీల విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తే తాను కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నానంటూ గగ్గోలు పెట్టొద్దని సూచించారు. కాలువల్లో పూడికతీత పనులపై ఎక్కువగా ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. ఈ విషయంలో సిబ్బంది తక్కువగా ఉన్నారని అధికారులు, కార్పొరేటర్లు, స్థానిక నేతలు చెప్తున్నారన్నారు. నగర నియోజకవర్గ పరిధిలో శానిటరీ విభాగంలో దాదాపు 20 శాతం మంది పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారనే విషయం తెలిసిందని పేర్కొన్నారు. ఎవరైనా తప్పకుండా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. 20 శాతం మందిని భర్తీ చేసుకోగలిగితే కాలువల్లో పూడికతీతతో పాటు అన్ని పనులను ఇబ్బందుల్లేకుండా చేపట్టొచ్చని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలో సముచిత స్థానం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. 48వ డివిజన్‌కు చెందిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి హుస్సేన్, మిత్ర బృందం దాదాపు 50 మంది నగరంలోని రాజన్న భవన్‌లో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తమ పార్టీలో వీరు చేరడం ఆనందంగా ఉందన్నారు. నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి అనేక మంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్దిక్ ఆధ్వర్యంలో అహ్మద్, బాబు, జావీద్, ఆసిఫ్, బాషా, తదితరులు పార్టీలో చేరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు కరిముల్లా, వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 33వ డివిజన్లో పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్పొరేటర్ మంజుల, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హజరత్‌నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): చిన్నబజార్‌లోని నెల్లూరు పెద్ద దర్గా ఖాజాపీర్ సాహెబ్ బందనవాజ్ సర్కార్ వారి గంధ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఖాజాపీర్ మకాన్ నుంచి గంధాన్ని పెద్ద దర్గాకు తీసుకొచ్చారు. ఖాజాపీర్ సమాధికి గంధాన్ని లేపనం చేశారు. తమిళనాడుకు చెందిన పీఠాధిపతి మౌలానా సాహెబ్ హష్మీ షా, కమల్ సర్తాజ్ సాహెబ్ ప్రత్యేక దువా చేశారు. పెద్ద దర్గా పీఠాధిపతి బాబాసాహెబ్ బందనవాజ్ పర్యవేక్షించారు.

5న రాష్ట్రస్థాయి నృత్య పోటీలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): వెస్ట్రన్ డ్యాన్స్ పోటీలను ఫిబ్రవరి ఐదున నిర్వహించనున్నారని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో సోలో, గ్రూప్ డ్యాన్స్ పోటీలను పురమందిరంలో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకుడు బాబు మాట్లాడారు. తమ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, పాల్గొనాలనుకునే వారు 85009 93786 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అమీర్‌జాన్, శ్రీనివాసులు, ప్రభాకర్, హరనాథ్‌రెడ్డి, భాస్కర్, రాజు, కోదండపాణి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న హరిత



కొండాయపాళెంలోని మున్సిపల్ స్కూల్లో..

నెల్లూరు సిటీ: ప్రజాకవి యోగి వేమన జయంతిని నగరంలోని పలు కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- నగరపాలక సంస్థ కార్యాలయంలో వేమన చిత్రపటానికి కమిషనర్ హరిత నివాళులర్పించారు. కార్పొరేటర్ వాసంతి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు (టౌన్): బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, వెంకట్రావు, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ గురవయ్య, అధ్యాపకులు సుధీర్, శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు మునిరాజా, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.



కేపీసీ జూనియర్ కళాశాలలో..

- కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వేమన పద్యాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, మాధవి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



జీవీఆర్ఆర్ కళాశాలలో..

క్రమబద్ధీకరించాలని ఎంపీకి వినతి



ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(సెంట్రల్): వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులను క్రమబద్ధీకరించేలా చొరవ చూపాలని అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. రసూల్, పవన్‌కుమార్, చంద్రమౌళి, నాగరాజు, హరిబాబు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా ట్రాక్టర్ల ర్యాలీ

నెల్లూరు(వేదాయపాళెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణిని నిరసిస్తూ నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ మైదానం వరకు ట్రాక్టర్ల ర్యాలీని ఈ నెల 26న నిర్వహించనున్నామని జిల్లా అఖిల పక్ష రైతు సంఘాల ఐక్యవేదిక నేతలు పేర్కొన్నారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని ఏపీ రైతు సంఘ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నేతలు కోటిరెడ్డి, వెంగయ్య, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, రమణయ్య, షానవాజ్, గోపాల్, వెంకటకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): దాడి ఘటనపై సంతపేట పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేటలోని పెద్దతోటకు చెందిన నిజాముద్దీన్ పినాకినీ పార్క్ సమీపంలోని గొబ్బెమ్మల పండగకు బుధవారం వెళ్లారు. కచ్చేరి వద్ద రంగనాయకులపేటకు చెందిన చాంద్‌బాషాతో అతనికి మాటామాటా పెరిగింది. దీంతో అతనితో చాంద్‌బాషా ఘర్షణకు దిగారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

అనంతరం రాత్రి పది గంటల ప్రాంతంలో నిజాముద్దీన్ తన ఇంటి పక్కనే ఉన్న అష్రఫ్ అలీతో కలిసి పాటకచ్చేరి వద్దకెళ్లారు. ఎందుకు గొడవపడ్డావని చాంద్‌బాషాను అష్రఫ్ అలీ ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు.. నిజాముద్దీన్ ముఖంపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నిజాముద్దీన్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు.. అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 30వ డివిజన్లో గల నక్కాగోపాల్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపనను గురువారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించిన సమయంలో సమస్యలను స్థానికులు తెలియజేశారన్నారు. ఈ క్రమంలో పనులను ప్రారంభించామని వివరించారు. కార్పొరేటర్ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ హరిబాబు, నేతలు రఘు, యనాదయ్య, నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీని కలిసిన న్యాయవాదులు



సుధాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న న్యాయవాదులు

నెల్లూరు రూరల్: అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని కనుపర్తిపాడులోని ఆయన నివాసంలో నెల్లూరు బార్ అసోసియేషన్ నేతలు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. న్యాయవాదులకు డెత్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేయాలని కోరారు. కార్పస్ ఫండ్ ద్వారా రూ.100 కోట్లను విడుదల చేయాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సుధాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది సతీష్‌కుమార్, న్యాయవాదులు పద్మాకర్, రంగారావు, నారాయణ, భాస్కర్, ప్రణీత్, వినోద్, జన్నత్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నెల్లూరు(సెంట్రల్): కారుణ్య నియామకం ద్వారా రాపూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా కిరణ్‌ను నియమించామని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి బాలాంజనేయులు పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు నియమించామని చెప్పారు.

భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలి



కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

నెల్లూరు(అర్బన్): నగరంలోని చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద పార్టీ 16, 17, 18వ డివిజన్ల నేతలు, కార్యకర్తలు ధర్నాను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృష్ణపట్నం నుంచి వెళ్లాల్సిన భారీ లారీలు కొద్ది రోజులుగా అతి వేగంతో చిల్డ్రన్ పార్కు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు. వారం క్రితం జరిగిన ప్రమాదంలో యువకుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలను నిషేధించడంతో పాటు యువకుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. అనంతరం కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ నగర నేత శ్రీనివాసులు, 17, 18వ డివిజన్ల కార్యదర్శులు సతీష్, జేకే పాణి, సంపూర్ణమ్మ, బాబు, వెంకటేశ్వర్లు, రఘు, గోమతి, తదితరులు పాల్గొన్నారు.

కేవీ రెడ్డి సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ఉద్యోగులను తన కుటుంబసభ్యులుగా చూసుకుంటూ డైనమిక్ లీడర్‌గా వెలుగొందిన దివంగత డాక్టర్ కేవీ రెడ్డి సేవలు ఎనలేనివని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో కేవీ రెడ్డి సంతాప సభను గురువారం నిర్వహించారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, నేతలు విష్వక్‌రెడ్డి, హరిబాబు, శ్రీనివాసులు, ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ సుధాకర్‌రావు, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, డాక్టర్లు విద్యాసాగర్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.